నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, సోమవారం 17 జూన్ 2024 | KAMAREDDY




బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, జూన్ 16: కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు చంద్ర మోహన్, శ్రీనివాస్ రెడ్డి పూలమొక్కను ఇచ్చి కలెక్టర్‌కు స్వాగ తం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లాలో అమలవుతున్న ధరణి, ధాన్యం సేకరణ, డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రగతిని అదనపు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, డీఈవో రాజు, డీపీఆర్వో శాంతికుమార్, తహసీల్దార్ జనార్దన్, కలెక్టర్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సారెస్పీ సామర్థ్యం.. డౌన్

- పూడికతీస్తేనే పూర్వవైభవం
- భారీగా తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- ఆరంభంలో 112 టీఎంసీలు
- 2022లో 80.5 టీఎంసీలు మాత్రమే
- ఇప్పుడు మరింత తగ్గే అవకాశం
- పూడిక తొలగిస్తున్న వారిని అడ్డుకుంటున్న అధికారులు

**ఉత్తర తెలంగాణ** వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటినిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతూ వస్తున్నది. ప్రాజెక్ట్ నిర్మాణ సమయం నుంచి 2022 సంవత్సరం వరకు ఈ ప్రాజెక్ట్ సామర్థ్యం దాదాపు 31.5టీఎంసీలు తగ్గింది. ప్రస్తుతం మరింత తగ్గి ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 1994, 2022 సంవత్సరాల్లో చేయించిన సర్వేలో ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 31.5 టీఎంసీలు తగ్గిందన్న విషయం వెల్లడయ్యింది. ఏటా సామర్థ్యం తగ్గుతూ వస్తే ప్రాజెక్ట్ పరిధిలోని జిల్లాలకు సాగు నీటి సరఫరా క్లిష్టతరమయ్యే అవకాశాలున్నాయి.

*–మోర్తాడ్, జూన్ 16*

### పూడిక తొలగింపునకు అధికారుల అడ్డంకులు

వేసవికాలంలో ఎస్సారెస్పీలో నీరు తగ్గిన ప్రతిసారి వ్యవసాయ క్షేత్రాలకు నల్లమట్టిని తరలించేవారు. జలాశయం ఉన్న ముప్కాల్ మండల పరిధిలో మొరంతో, మిగతా భాగమంతా నల్లమట్టితో నిండి ఉంటుంది. ప్రతి వేసవిలో వేలాది టిప్పర్ల ద్వారా నల్లమట్టిని వ్యవసాయ క్షేత్రాలు, వివిధ అవసరాలకు మొరంనూ తరలించేవారు. ప్రాజెక్టులోని నల్లమట్టి భూమిసారవంతం కోసం ఉపయోగపడుతుండడంతో మట్టిని పొలాల్లో వేసుకునేందుకు రైతులు ముందుకువచ్చేవారు. ఇలా దాదాపు ఐదారేండ్లు పొక్లెయిన్లు పెట్టి నల్లమట్టిని తరలించారు. అయితే అటు నిర్మల్, ఇటు నిజామాబాద్ జిల్లాలకు చెందిన అధికారులు, ఎస్సారెస్పీ అధికారులు ఈ తతంగాలు జరగాలంటే తమ చేతులు తడపాల్సిందే అనడం, లేకుంటే అడ్డుపడడంతో రెండేండ్లుగా మట్టి తొలగింపు పనులు కొనసాగడం లేదని తెలిసింది. ప్రతి వేసవిలో పూడికను తొలగిస్తున్న వారిని అధికారులు ప్రోత్సహిస్తే ఏటా కొంత పూడిక తొలగిపోయి ఎస్సారెస్పీలో మరింత పూడికచేరకుండా ఉండే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం సైతం పూడిక తొలగింపు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆరంభంలో 112 టీఎంసీలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి 1963లో శంకుస్థాపన చేయగా 1978లో పనులు పూర్తయ్యాయి. 1091 అడుగులు, 112 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో ఎస్సారెస్పీని నిర్మించారు. దీని ద్వారా 18లక్షల ఎకరాలకు సాగునీరందించేలా రూపకల్పన చేశారు. ప్రాజెక్ట్ ఆయకట్టుకు నీటిని అందించేందుకు కాకతీయ, సరస్వతి, లక్ష్మీకాలువ, వరదకాలువలను నిర్మించారు. వీటి ద్వారా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిర్మల్ జిల్లాలతోపాటు, బాల్కొండ నియోజకవర్గానికి సాగునీటిని అందిస్తున్నారు. సాగు, తాగునీటిని అందించడంతోపాటు 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని 1988లో ప్రారంభించారు.



### భారీగా తగ్గుతున్న నీటినిల్వ సామర్థ్యం

112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఎస్సారెస్పీ సామర్థ్యం 2022లో చేసిన సర్వే ప్రకారం 31.5 టీఎంసీలు తగ్గి 80.5టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీకి వచ్చే వరద ప్రాంతాలు నల్లరేగడి భూములు ఉండడంతో ఈ జలాశయంలోకి భారీగా పూడిక వచ్చిచేరుతుంది. ఇది గమనించిన అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించగా 1994లో సర్వే చేయించగా 21.687 టీఎంసీల పూడికచేరిందని తేల్చారు. దీంతో ప్రాజెక్ట్ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 90.313టీఎంసీలకు తగ్గించి లెక్కించారు. తిరిగి పూడిక విషయంలో అనుమానాలు రేకెత్తడంతో 2022, మేలో చెన్నైకి చెందిన సీకాం కంపెనీతో పూడిక సర్వే చేయించారు. ఈసర్వే ప్రకారం 9.813 నీటినిల్వ సామర్థ్యం పడిపోయిందని తేలింది. అప్పటి నుంచి ప్రాజెక్ట్ సామర్థ్యం 80.5 టీఎంసీలుగా లెక్కిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 6.39టీఎంసీల నీరు ఉండగా పాత గణాంకాల ప్రకారం డెడ్‌స్టోరేజీ 5 టీఎంసీలు మాత్రమే. రెండుసార్లు చేసిన సర్వేలో ఏకంగా 31.5 టీఎంసీల పూడిక చేరినట్లు తేలగా ఈ రెండు సంవత్సరాల్లో పూడిక ఎంత మేరకు చేరి ఉంటుందోననే ఆందోళనవ్యక్తమవుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో డెడ్ స్టోరేజీ ఎంత అనేది అధికారులు మాత్రం వెలువరించడం లేదు.



శ్రీరాంసాగర్ జలాశయంలో పూడికమట్టి

## ధర్మారం (బీ) పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

డిచ్‌పలి, జూన్ 16 : డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) పంచాయతీ కార్యదర్శి రాజలింగంను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజలింగం గతంలో గాంధారి మండలం బూర్గుల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో రాజలింగం చెక్కుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టిన అధికారులు చెక్కులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. దీంతో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ప్రస్తుతం ధర్మారం(బీ) పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజలింగంను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

## 38 ఏండ్ల తర్వాత అపూర్వ కలయిక

**చదువుకునే** రోజుల్లో అనేక చిలిపి పనులు, మధుర జ్ఞాపకాలను మిగిలిస్తాయి. అదే చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులందరూ 38ఏండ్ల తర్వాత ఒకేచోట కలుసుకుంటే ఆ ఆనందానికి వెలకట్టలేము. అలాంటి మధుర జ్ఞాపకాలకు వేదికయ్యింది బోధన్. పట్టణంలోని బీటీ నగర్ ఉన్నత పాఠశాలలో 1986-87వ సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సుమారు 38ఏండ్ల అనంతరం కలుసుకున్న వారు విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు తమకు చదువు చెప్పిన గురువులు పోచాద్రి, వెంకట సుబ్బయ్యలను ఘనంగా సన్మానించారు.

*– శక్కర్‌నగర్, జూన్ 16*



## ఆగని ఇసుక అక్రమ దందా..

- పట్టించుకోని అధికారులు
- సామాన్యులకు తప్పని తిప్పలు
- ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన విలేకరికి అధికార పార్టీ నాయకుడి బెదిరింపులు

భీమ్‌గల్,జూన్ 16: భీమ్‌గల్‌లో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు.. ఆరుకాయలు అన్నచందంగా నడుస్తున్నది. కొంతకాలంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఉదయం కప్పల వాగులోనుంచి డంపు చేయడం, రాత్రి అయ్యిందంటే భారీ లారీల్లో రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వానికి లక్షల రూపాయల్లో గండి పడుతున్నది. సామాన్యులు ప్రభుత్వానికి చలాన్ కట్టినా దొరకని ఇసుక.. అక్రమదారులకు మాత్రం సులభంగా లభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగంగానే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న లారీలు

### ప్రభుత్వం మారడంతో అక్రమ రవాణాకు రెక్కలు..

ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమ రవాణాకు రెక్కలొచ్చాయి. గత ప్రభుత్వంలో ఇసుక రవాణాపై కఠిన ఆంక్షలు ఉండడంతో అక్రమ రవాణాకు వీలు లేకుండాపోయింది. ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా మొదలు పెట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### ప్రశ్నిస్తే.. బెదిరింపులు

భీమ్‌గల్ మండలంలో ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన విలేకరిపై అధికార పార్టీ నాయకుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. తిట్ల పురాణం మొదలు పెట్టాడు. ఇసుక రవాణాకు అనుమతి ఉందా అని ప్రశ్నించడంతో లారీడ్రైవర్ సదరు పార్టీ నాయకుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ఆ నాయకుడు ఫోన్‌లో విలేకరిపై తిట్ల దండకం మొదలు పెట్టి బెదిరింపులకు పాల్పడ్డాడు. నీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకో అంటూ దుర్భషలాడాడు. ప్రస్తుతం ఆ మాటల రికార్డింగ్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

### కఠిన చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇది వరకే అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి సంబంధిత శాఖ అధికారులకు అప్పజెప్పాం. ఇసుక రవాణాకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

**-హరిబాబు, ఎస్సై, భీమ్‌గల్**

## విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

ఇక నుంచి ప్రతి సోమవారం నిర్వహణ

ఖలీల్‌వాడి, జూన్ 16: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ప్రతి సెక్షన్, సబ్ డివిజన్, ఈఆర్వో డివిజన్ ఆఫీసుల్లో, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సర్కిల్ ఆఫీసులో వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ ఉన్నప్పటికీ ప్రజావాణి నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



నాడు రక్షణ..



నేడు నిర్లక్ష్యం..

## హరితగోస

**ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా** గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. మొక్కలను నాటి అవి ఏపుగా పెరిగే వరకు సంరక్షణ చర్యలు తీసుకున్నది. ముళ్లకంచెలు వేసి మొక్కలు పశువులకు మేతగా మారకుండా జాగ్రత్తలు తీసుకున్నది. ప్రస్తుతం హరితహారంపై నిర్లక్ష్యపు నీడలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అందుకు డిచ్‌పల్లి మండలం దేవానగర్ క్యాంప్‌లో కనిపిస్తున్న కొయ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మొక్కలు పశువులకు మేతగా మారాయి. మొక్కల సంరక్షణ పట్టించుకోకపోవడంతో కనుమరుగవుతున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్